దేశంలో విద్వేష రాజకీయాలు

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు

విశాలాంధ్ర - విశాఖ : ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని కేంద్రం పక్కన పెట్టి దేశంలో విద్వేష రాజకీయాలు సృష్టించి ప్రజల మాన, ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు విమర్శించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విశాఖ జిల్లా 11వ మహాసభల మాజీ నాయకులు పి.చంద్ర శేఖర్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లెనిన్ బాబు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టడం బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ఎజెండాగా మార్చుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పి.చంద్ర శేఖర్ ప్రారంభోపన్యాసం చేస్తూ నిరుద్యోగుల సమస్యలపై, ఆర్థిక మోసాలపై పోరాటం చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళీ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల్లో ప్రతి ఏడాదీ జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరవాత లక్షలాది మంది నిరుద్యోగ యువతను నిట్ట నిలువుగా ముంచారని వాపోయారు.

ఎస్.వి. యూనివర్సిటీ మాజీ లెక్చరర్ క్షేత్రపాల్ మాట్లాడుతూ భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, ఆజాద్ వంటి వారు యుక్త వయస్సులోనే స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలర్పించారని, వారి స్ఫూర్తితో దేశంలో యువత భవిష్యత్తు కోసం చుట్టూ జరిగే అన్యాయాలపై పోరాటాలు చేయాలని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఏఐవైఎఫ్ జెండా చేతపట్టి సమరశీల ఉద్యమాలకు విశాఖ కేంద్రంగా సమాయత్తం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు, అన్ని ప్రాంతాల యువకులు పాల్గొన్నారు.

సరుకు రవాణాలో పోర్టు ట్రస్టు మరో రికార్డు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు ట్రస్టు గత రికార్డులను అధిగమిస్తూ సరుకు రవాణాలో శనివారం సరికొత్త రికార్డును నెలకొల్పిందని విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు తెలిపారు. విశాఖపట్నం పోర్టు ఆవిర్భవించిన తర్వాత ఒక్క రోజులో అత్యధిక సరుకు రవాణా చేసిన ఘనతను ఈనెల 17న సాధించిందన్నారు. 17వ తేదీన 4,01,875 మెట్రిక్ టన్నుల సరుకును 23 షిప్పుల నుంచి వివిధ బెర్త్‌లు ద్వారా హ్యాండిల్ చేసి గతంలో ఒక్క రోజులో చేసిన అత్యధిక సరుకు రవాణా రికార్డును తిరగరాసిందని తెలిపారు. ఈ ఏడాది మే 7వ తేదీన పోర్టులోని వివిధ బెర్త్‌ల ద్వారా 27 షిప్‌లో నుంచి చేసిన 3,78,760 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా ఇప్పటి వరకు ఒక్కరోజులో పోర్ట్ చేసిన అత్యధిక సరుకు రవాణాగా రికార్డులలో ఉందని, ఆ రికార్డును శనివారం అధిగమించి సరికొత్త రికార్డును నమోదు చేసిందని తెలిపారు. విశాఖపట్నం పోర్టు నూతన రికార్డులను సాధించటం పట్ల పోర్టు అథారిటీ చైర్మన్ డా. అంగముత్తు, పోర్టు ట్రాఫిక్ మేనేజర్ రత్న శేఖర్, సిబ్బందిని ప్రశంసించారు. ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన ట్రాఫిక్ విభాగం సిబ్బందిని డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే, కార్యదర్శి టి.వేణుగోపాల్‌లు ప్రశంసించారు.

జగనన్న ఆణిముత్యాలకు నగదు ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర - భీమిలి: తాటితూరు పాఠశాలలో చదువుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం కొణతాల గోపిక శ్రీ 560 మార్కులు, ద్వితీయ స్థానం గారి దీప్శ 510 మార్కులు, తృతీయ స్థానం పొట్నూరు శ్రీరామ్ 507 మార్కులు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొకర శ్రీనివాసరావు తెలిపారు. వీరికి ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన నియోజకవర్గ సమావేశంలో మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా తమ పాఠశాల పిల్లలు జగనన్న ఆణి ముత్యాలు అవార్డుల్లో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహు మతులుగా 3000, 2000, 1000 రూపాయలు క్యాష్ అవార్డ్స్, మెడల్స్, సర్టిఫికెట్స్ పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపా ధ్యాయ కార్యదర్శి టి.ఎస్.వి.ప్రసాదరావు, సర్పంచ్ సిరిగుడి సంతోషి, ఈశ్వర రావు, ఎంపీటీసీ ఉండబట్ల ఆదిలక్ష్మి, గ్రామ పెద్దలు ఉండబట్ల చిన్నా, దుంపల ప్రభాకర్, శ్యామ్, నాగమణి, చైర్మన్ సరగడ రవి పాల్గొన్నారు.

సమాజ సేవకు కేరాఫ్ అడ్రస్ వెంపాడ

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా

విశాలాంధ్ర - భీమిలి: విద్య, సామాజిక సేవలో అనునిత్యం మమేకమై సహకారం అందించడంలో వుయ్ కేర్ యు సంస్థ అధినేత వెంపాడ శ్రీనివాసరెడ్డి ఎప్పుడూ ముందుంటారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు. వెంపాడ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భీమిలి శాఖ ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి విద్యార్థులకు హిందీ పరిచయ్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఎంతోమంది పేద విద్యార్థులకు హిందీ ప్రత్యేకంగా నేర్చుకోవాలన్న కుతూహలం ఉన్నా వారికున్న ఆర్థిక ఇబ్బందులు కారణంగా ముందుకు రాలేకపోతున్నారని అన్నారు. ఇది గమనించిన కేఎస్ఆర్ కృష్ణారావు మాస్టర్ భీమిలిలో ఆదర్శ్ హిందీ ప్రేమిమండలిని స్థాపించి విద్యార్థులకు ఫీజులు, పుస్తకాలు ఉచితంగా అందిస్తూ వివిధ రకాల పరీక్షలకు తర్ఫీదు ఇస్తున్నారని అన్నారు. ఆవిధంగా కృష్ణారావు మాస్టర్ చేస్తున్న కృషికి ఎంతోమంది దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు వారికి తోచిన సాయం చేస్తున్నారని అన్నారు.

కిటకిటలాడిన బైరవాలయం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి క్షేత్ర పాలకుడు బైరవ స్వామి వారి ఆలయం ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులతో కిటకిట లాడింది. వేకువ జాము నుండి మధ్యాహ్నం వరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, ఒడిశా నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో భక్తులు సుమారు కిలో మీటరు వరకు క్యూలో బారులు తీరి కనిపించారు. భైరవస్వామిని దర్శించుకున్న అధిక శాతం భక్తులు అమృతకలశాలను మొక్కుబడులుగా సమర్పించడంతో పాటు పంచామృతాభిషేకాలు జరిపించుకున్నారు. ఇన్‌చార్జ్ ఈఓ భ్రమరాంబ ఆదేశాల మేరకు ఏఈవో జంగం శ్రీనివాసరావు దేవస్థానం సిబ్బంది ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు.

మరిణమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే బాబూరావు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలోని పాటిమీద గ్రామంలో వేంచేసియున్న కాండ్రకోట మరిణమ్మ తల్లిని ఆదివారం పాయకరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు కాండ్రకోట మరిణమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మౌలిక సదపాయాలు సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మాజి డీసీసీబీ వైస్ చైర్మన్ అయినంపూడి బంగారాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ప్రారంభం

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గ్రామ సచివాలయంలో ప్రారంభమయ్యాయి. మండలంలో రీ సర్వే పూర్తయిన కణమాం, ఎన్‌జీఆర్ పురం పంచాయతీల్లో కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ కె.సత్య పద్మ చేతుల మీదగా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి రైతులకు పత్రాలు అందజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఉన్న 18 సచివాలయాల్లో కూడా త్వరలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ లోకవరపు రామారావు, సబ్ రిజిస్టర్ కార్యాలయ సీనియర్ సహాయకులు, సచివాలయం సిబ్బంది, గ్రామ కార్యదర్శి, వైసిపి నాయకులు లెంక రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఎల్‌బి వెంకటరావుకు బదిలీ

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండల విద్యాశాఖాదికారిగా ఉపాధ్యాయ శ్రేయస్సును కోరి అహర్నిశలు శ్రమిస్తూ, రాజకీయ నాయకులకు, ప్రజల మధ్య సమన్వయంతో, మృదువైన శైలితో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎన్నో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ విశేష సేవలు అందించిన ఎల్‌బి వెంకటరావుకు బదిలీ అయింది. అనంతగిరి మండల ఎంఈఓగా పని చేసిన ఎల్‌బీ వెంకటరావుకు మునగపాక మండలానికి బదిలీ అయింది.

కిలో కాఫీకి అదనంగా ఎనిమిది రూపాయలు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్ కు కాఫీ పళ్లను సరఫరా చేసిన కాఫీ రైతులకు కమ్మని తీపి కబురు ఐటిడిఏ ముందుగా అందిస్తున్న ధరకు అదనంగా కిలోకు ఎనిమిది రూపాయలు చొప్పున చెల్లించనున్నట్టు పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేక్ తెలిపారు. చింతపల్లి మాక్స్ సోసైటీకి కాఫీ పళ్లను సరఫరా చేసిన కాఫీ రైతులకు రూ.52.97 లక్షలు బోనస్‌గా అందిస్తున్నామన్నారు. తెలియజేసారు. పార్చ్‌మెంట్ కాఫీని బహిరంగ వేలంలో విక్రయించగా వచ్చిన లాభాలను గిరిజన రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. బోనస్‌ను పారదర్శకంగా గిరిజన రైతులకు పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. చింతపల్లి మాక్స్ సంస్థకు 11 మండలాల నుండి 38 పంచాయతీలకు చెందిన 4747 మంది కాఫీ రైతులు 662,123 మెట్రిక్ టన్నుల కాఫీ పళ్లను సరఫరా చేసారని వెల్లడించారు. ముందుగా కిలో కి రూ.38/లు చెల్లించానున్నారు. ఇప్పుడు కిలోకు అధనంగా ఎనిమిది రూపాయలు చెల్లిస్తున్నామన్నారు. ఏజెన్సీలో కాఫీ విస్తరణకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది మరో 16 వేల ఎకరాల్లో కాఫీని విస్తరిస్తున్నామని చెప్పారు. కాఫీ రైతులకు ఐటిడిఏ నిరంతం అండగా నిలుస్తోందని పిఓ పేర్కొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

- నెలరోజులు దాటినా విద్యుత్ సరఫరా అందించని అధికారులు
- పంటలకు కాలువల్లో నీటిని మోటార్లతో తోడుతున్న రైతులు

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: విద్యుత్ సరఫరా లేక పంటలకు సాగునీరు అందించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు అందించిన వివరాల ప్రకారం నెల రోజుల క్రితం మండలంలోని సత్యవరం గ్రామంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసిందని తెలిపారు. దీని కారణంగా గ్రామంలోని పంట భూముల్లో విద్యుత్ స్థంబాలు నేలకొరిగాయని తెలిపారు. విద్యుత్ వైర్లు తెగిపోయాయని తెలిపారు. సుమారు 22 స్థంభాలను మార్చాల్సిన అవసరం ఉందని విద్యుత్ అధికారులు గుర్తించారని తెలిపారు. అయితే అప్పటి నుండి నేటి వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు అమర్చి విద్యుత్ సరఫరా అందించ లేదని తెలిపారు. మార్చాల్సిన విద్యుత్ స్తంబాల పరిధిలో 4 ట్రాన్స్‌ఫార్మర్స్ ఉన్నాయని వాటి పరిధిలో 12 బోర్లు ఉన్నట్లు తెలిపారు. గత నెలరోజులుగా విద్యుత్ సరఫరా లేక పంటలను పక్కనే ఉన్న సాగునీటి కాలువ నుండి మోటార్లు పెట్టుకొని నీరు వాడుకుంటున్నామని రైతులు తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకొని విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా అందించాలని రైతులు గుండ్ర గంగాధర్, కొంతం బాబ్జి, తలారి సాయి, సఖిలేటి కృష్ణ, సఖిలేటి వెంకన్న, వెలుగుల వెంకట్రావు తదితరులు కోరుతున్నారు. ఈమేరకు లైన్‌మెన్ సత్యనారాయణను వివరణ కోరగా 11కెవి పనులు పూర్తి చేస్తున్నామని, ఎల్‌టి పనులు పూర్తి చేయాల్సి ఉందని, మరో రెండు రోజుల్లో విద్యుత్ సరఫరా అందిస్తామని తెలిపారు.

పంట భూముల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

బి.కె.ఎం.యు జిల్లా ప్రథమ మహాసభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నర్సీపట్నం: ఈనెల 23వ తేదీన నర్సీపట్నం కృష్ణ ప్యాలెస్ వద్ద జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభను యువ రైతులు, వ్యవసాయ కార్మికులంతా ఏకమై మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివలంక కొండలరావు, మాకిరెడ్డి రాము నాయుడు అన్నారు. గొలుగొండ మండలం గుండుపాల గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు వ్యవసాయ కార్మికులకు మాయ మాటలు చెప్పి గద్దికెక్కి నేటి వరకు అన్నం పెట్టే రైతన్నకు, కూలి పని చేసుకున్న కార్మికులకు, ప్రజానీకానికి గత ప్రభుత్వాలు చేయలేని విధంగా రైతు కూలీలకు ఉపయోగపడలేని పథకాలు పెట్టి ప్రజా ఆస్తిని నిలువునా దోపిడీ చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు ద్వారా రైతు, ఇనాందారులకు ప్రభుత్వ రేటుకి రైతుకి ఇవ్వాలని చాలా సం.రాల నుండి సాగు చేసి భూమికి సంరక్షణగా ఉన్నందున రైతుకు పరిహారం కల్పించి న్యాయం చేయాలని అన్నారు. నర్సీపట్నం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులుగా కిల్లాడ అప్పలనాయుడు, గునూరు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.సం. జిల్లా ఉపాధ్యక్షులు వెలుగుల అర్జున్‌రావు, సహాయ కార్యదర్శి చొడే శ్రీనివాస్ చౌదరి, సీపీఐ మండల కార్యదర్శులు మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ, మండల రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

చలో విజయవాడ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కె.కోటపాడు: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల 20న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) జిల్లా ఉపాధ్యక్షులు దుక్క ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కె.కోటపాడు శివాజీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో చలో విజయవాడ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లైములకు వెంటనే నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డులో నేటికీ సుమారు 32 వేల పైచిలుకు క్లెయిములు పెండింగ్లో ఉన్నాయని అందువలన కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగులో ఉన్న క్లెయిములకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మొల్లి నాయుడు, పాత్రపల్లి సోము నాయుడు, సమ్మంగి రాము, గండిబోయిన అప్పారావు, ఆడారి కృష్ణ, తులసిరావు పాల్గొన్నారు.

సేవ్ విశాఖ పేరిట టీడీపీ కొవ్వొత్తుల నిరసన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖను రక్షించండి అంటూ తెలుగుదేశం శ్రేణులు ఆదివారం సాయంత్రం నగరంలో పెద్ద ఎత్తున కొవ్వొత్తుల నిరసన వ్యక్తం చేశారు. విశాఖ నగరంలో భూకబ్జాలు, హత్యలు, కిడ్నాప్లు అధికమైపోయాయని, ప్రశాంతతకు మారు పేరుగా ఉన్న విశాఖ నగరాన్ని నారా సంస్కృతికి అడ్డాగా వైసిపి ప్రభుత్వం మార్చిందని టిడిపి నేతలు మండిపడ్డారు. ఇటీవల విశాఖ ఎంపీ కుటుంబాన్ని రౌడీషీటర్లు కిడ్నాప్ చేయడమే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. విశాఖను రక్షించకపోతే భవిష్యత్తులో అశాంతికి నిలయంగా మారిపోతుందని, విశాఖ నగర ప్రజలంతా వైసీపీ ప్రోత్సహిస్తున్న రౌడీ పాలనకు వ్యతిరేకంగా వీధుల్లోకి రావాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. తొలుత టిడిపి కార్యాలయం నుంచి ర్యాలీగా చేరుకొని జైల్ రోడ్ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవి రావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం పార్లమెంటరీ అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ నాలుగేళ్ల వైసీపీ పాలనలో విశాఖను నేర నగరంగా మార్చేశారని, హత్యలు కిడ్నాప్లు దోపిడీలు భూకబ్జాలు అధికమై పోయాయని పోలీసులు వైసీపీ నేతలకు మాత్రమే రక్షణగా పని చేస్తున్నారని, ప్రజల ఆస్తులకు ప్రజలకు రక్షణగా లేరని ఆరోపించారు. వేల ఎకరాలు విశాఖలో కబ్జాలకు గురయ్యాయని ఆర్థిక లావాదేవీలే అధికమై పోవడంతోనే కిడ్నాప్‌లు పెరిగిపోతున్నాయని మండిపడ్డారు.

పింఛన్లను తొలగించడమే మంత్రి పేదలకు ఇచ్చిన కానుకా..?

మాజీ ఎమ్మెల్యే పీలా

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: తనను ఓట్లు వేసి గెలిపించిన అనకాపల్లి నియోజకవర్గ పేదలకు 3వేల పింఛన్లను తొలగించి మంత్రి గుడివాడ అమర్నాథ్ కాను కగా ఇచ్చారని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. 15 రోజుల్లోగా తొలగించిన పింఛన్లను పునరుద్ధరించకుంటే మంత్రి గుడివాడ అమర్నాథ్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. పట్టణంలో నెయ్యిల వీధిలో తొలగించిన పింఛన్లపై మంత్రి అమర్నాథ్‌కు సెల్ఫి ఛాలెంజ్ విసిరారు. టీడీపీ హయంలో 13వేల నుండి 30వేల పింఛన్లను ఇచ్చామని ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం ఒక్క అనకాపల్లి పట్టణంలోనే 950మంది పేదల పింఛన్లను కక్ష కట్టి తీసివేశారు అని ఆరోపించారు. 3వేల పేద కుటుంబాలను మంత్రి గుడివాడ అమర్నాథ్ రోడ్డున పడేసారని అన్నారు. ప్యాకేజీలపై ఉన్న శ్రద్ధ పేదల ఇబ్బందులపై లేదని అన్నారు.

పాలకుల మాటలు పచ్చి బూటకం

రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రైతాంగ ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు చెప్పే మాటలన్నీ బూటకమని రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ అన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా మహాసభ అనకాపల్లిలోని రోటరీ కళ్యాణ మండపంలో జరిగింది. ముందుగా రైల్వే అండర్ బ్రిడ్జి నుండి నెహ్రూ చౌక్ మీదుగా సభా ప్రాంగణం వరకు జిల్లా నలుమూలల నుండి వచ్చిన రైతులు, వ్యవసాయ కూలీలతో ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కోన మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఝాన్సీ మాట్లాడారు. గత 30 ఏళ్లుగా కొనసాగుతున్న రైతాంగ ఆత్మహత్యల తీవ్రత దీనిని స్పష్టం చేస్తుందని, మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా, మద్దతు ధరల చట్టం సాధన కోసం ఢిల్లీ వీధుల్లో లక్షలాదిమంది రైతులు తీవ్రంగా పోరాటం చేసిన కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. పైగా రైతులపైనే తప్పుడు కేసులు బనాయించారని అన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ దంతులూరి వర్మ మాట్లాడుతూ అనకాపల్లి, ఉత్తరాంధ్ర ప్రాంతమంతా అనేక సాగునీటి వనరులు, జీవగెడ్డలు ఉన్నప్పటికీ కరువు వలసలు తాండవిస్తున్నాయని, ఈ దుర్భర పరిస్థితులకు పాలకుల వినాశకర విధానాలే కారణమన్నారు. కార్మిక నగారా పక్షపత్రిక ఎడిటర్ కామ్రేడ్ ఆడారి అప్పారావు మాట్లాడుతూ ఏ దేశ అభివృద్ధికైనా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలే పునాది రంగాలని, కానీ పాలకులు వాటినే విధ్వంసం చేస్తున్నారన్నారు. సభలో జనసాహితి జిల్లా అధ్యక్షులు ఐటిఆర్పి శివాజీరావు, నవ యువ సమాఖ్య జిల్లా నాయకులు ఎస్.భాస్కర్‌రావు తదితరులు ప్రసంగించారు. ఈ మహాసభలో కామ్రేడ్ ఆడారి అప్పారావు అధ్యక్షులుగా, కామ్రేడ్ కోన మోహన్‌రావు కార్యదర్శిగా, 20 మంది కమిటీ సభ్యులతో నూతన జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లాలో సుగర్ ఫ్యాక్టరీల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, చెరకు రైతుల బకాయిలు తక్షణమే చెల్లించాలని, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఫార్మా పరిశ్రమలలో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని తదితర తీర్మానాలు చేశారు.

నిత్యాన్నదానం రెండో వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన జగదీష్ మాస్టారు విశాఖపట్నం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 84 మంది నిరు పేదలకు రెండు సంవత్సరాలుగా నిత్య అన్నదానం చేస్తూ ఉన్నారు. ఆదివారం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జగదీష్ మాస్టారు 84 మంది నిరుపేదలకు స్టీల్ పల్లాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి పేదవాడు చిరునవ్వుకు కారణమైనందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టారు ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి స్టీల్ పల్లాలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

వి.ఆర్.ఎ.ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - తగరపువలస: రాష్ట్ర ప్రభుత్వంకి ప్రజలకు వారధులుగా ఉన్న వీఆర్ఏలను ప్రభుత్వం మరచిపోవడం అన్యాయమని వీఆర్ఏల సంఘం భీమిలి జోన్ గౌరవాధ్యక్షులు రవ్వ నర్సింగరావు, పోలివల్లి, అప్పలరాజు, ఎద్దు అప్పారావులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు కనీస వేతనం 26,000/- ఇవ్వాలని, పైస్కేల్ వేతనం చెల్లించాలని, డీఏ బకాయిలు చెల్లించాలని, చనిపోయిన వీఆర్ఏ కుటుంబానికి, నామినీగా పని చేస్తున్న వారికి పర్మినెంటుగా ఉద్యోగం ఇవ్వాలన్నారు. వీఆర్వో అటెండర్స్, కారుడ్రైవర్, వాచ్మెన్‌లకు ప్రమోషన్ కల్పించాలన్నారు. మహిళా వీఆర్వోలకు మెటర్నిటీ లీవు 6నెలలు ఇవ్వాలని, చనిపోయిన వీఆర్ఏ కుటుంబానికి గ్రాట్యుటీ, పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.

ఉపాధి హామీ పథకంలో అవకతవకలు ?

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగాయంటూ మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన పలువురు ఆరోపించారు. ఈమేరకు గ్రామంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బృందం విచారణ నిర్వహిస్తుండగా సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. విఆర్పీ తాను చేసిన తప్పులను నిలదీశామని మేట్‌లుగా ఉన్న తమను తొలగించారని త్రిపరాల అరుణ, బసనబోయిన దేవి లిఖిత పూర్వకంగా బృందానికి ఫిర్యాదు చేశారు. ఉపాధి పనులకు రాని వారికి మస్తర్లు వేస్తున్నారని, వచ్చిన వారికి మస్తర్లు వేయడం లేదని, ఒక వేళ మస్తర్లు వేసినా ఎక్కౌంటులో నగదు జమ కావడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. ఉపాధి పని కల్పించాలని రెండేళ్లుగా తిరుగుతున్నా పనులు కల్పించలేదని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బృందం సభ్యులను ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మేకా ప్రసాద్, పందు గోవిందు, కూలి సుభాష్, కూలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యేల్లేటి శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయం



విశాలాంధ్ర - పెదగంట్యాడ: విశాఖపట్నం స్టీలుప్లాంట్ కార్మికుడిగా, ఏఐటీయూసీ యూనియన్ నాయకుడిగా, పెదగంట్యాడ సీపీఐ పార్టీ కార్యదర్శిగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, అందరికీ సేవలు అందిస్తున్న యేల్లేటి శ్రీనివాసరావు ప్రశంసనీయులని విశాఖ నగర మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పేర్కొన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా ఆదివారం నగరంలోని ప్రముఖ హోటల్‌లో అఖిలగాంధ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో పలువురికి సేవలందిస్తూ ప్రజా మన్నలను పొందాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ, ఎన్నేటి తాతారావు, డాక్టర్ కుర్మా రావు, సన్యాసిరావు, అనపర్తి త్రినాథరావు, రామారావు, పెదబాబు, పి.సూరిఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జూలై 1 నుంచి తపాలా కార్యాలయంలో ఆధార్ కేంద్రం

విశాలాంధ్ర - చింతపల్లి: తపాలా శాఖ కార్యాలయంలో జూలై 1 నుంచి ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక తపాలా శాఖ పోస్ట్ మాస్టర్ సిహెచ్ రమణ మూర్తి అన్నారు. ఆధార్ కార్డులో పేర్లు పొరపాట్లు, మార్పులు, చేర్పులు, అప్డేట్ సమస్యలతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీపీ కోరాబు అనూష దేవి, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతలు అనకాపల్లి తపాల శాఖ సూపరింటెండెంట్ జంపాల ప్రసాద్ బాబు దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన ఈ సమస్యలను తొలగించేందుకు తపాల శాఖ ఆధ్వర్యంలో చింతపల్లిలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని సంకల్పంతో జూలై 1 నుంచి ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు లేని వారు, 0 నుంచి 5 ఐదేళ్ల లోపు చిన్నారులు పుట్టిన ధ్రువపత్రం ఫోన్ నెంబరు వెంట తీసుకు రావాలని ఆయన సూచించారు. ఈ ఆధార్ కేంద్రాన్ని విని యోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్య క్రమంలో పైల శ్రీనువాస్, సత్యనారాయణ తపాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో ఎన్.నర్సాపురం గ్రామంలో శనివారం జరిగిన 9 మంది రైతులకు చెందిన 4.50 భూములలో జీడి మామిడితోటలు మంటలు చెలరేగి కాలిపోవడం జరిగిందని, తక్షణమే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం రైతులతో కలిసి కాలిపోయిన జీడి మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ జీడి మామిడి తోటలు కాలి పోయిన రైతులందరూ కూడా పేద రైతులని ఈ భూములు తప్ప వీరికి వీరే ఆధారం లేదని, ఈ విధంగా పంట ఫలసాయం చేతికి అందివచ్చే సమయంలో జీడి మామిడితోటలు, ఫలసాయం అగ్నికి ఆహుతి అవడం వలన పేద రైతులు తీవ్రంగా నష్టపోయి ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించి రైతులను అదుకోవాలన్నారు.



7వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - మధురవాడ: పేద, మధ్య తరగతి ప్రజలు, పిల్లల ఆహ్లాదానికి పార్కులు ఎంతగానో దోహదపడతాయని మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాస్ అన్నారు. జోన్ 2 పరిధి ఏడవ వార్డులో గల స్వతంత్ర నగర్, మిథిలాపురి, ఎన్జీవోయస్ కాలనీలలో గల పార్కుల అభివృద్ధికి రూ.53.57 లక్షల రూపాయల అంచనా వ్యయంతో జీవీఎంసీ చేపట్టిన కార్యక్రమాలకు ఆదివారం ఆయన శంకు స్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలి నియోజ కవర్గం లో ఉన్న ప్రతీ పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతా మన్నారు. మధురవాడ స్థానిక సమస్యలను తన వరకూ చేరవేయడంలో స్థానిక నాయకులు చేస్తున్న కృషి ఎంతో ఉందని అన్నారు. ఈ కార్య క్రమంలో భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జోన్ 2 కమీషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి, ఏడవ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ వెంకటరావు, ఐదు, ఏడు వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, పోతిన శ్రీనివాసరావు, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, వంకాయల మారుతీ ప్రసాద్, నూకవరపు బాబ్జి, పిల్లా సూరిబాబు, వాండ్రాసి రవికుమార్, అల్లాడ లింగేశ్వరరావు, తమ్మినేని వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా ప్రసాద్

విశాలాంధ్ర - జికేవీధి: జికేవీధి మండల తహశీల్దార్‌గా ఎస్ఎల్‌వి.ప్రసాద్ నియమితుల య్యారు. ఇప్పటి వరకు చింతపల్లి ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా పని చేసిన అతన్ని తాజా బదిలీల్లో జికేవీధికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విధుల్లోకి చేరనున్నట్లు తెలిపారు.

ఈఎంఆర్ఎస్‌లో ప్రవేశానికి విద్యార్థులు రిపోర్టు చేయాలి

విశాలాంధ్ర - జికేవీధి: ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు సకాలంలో రిపోర్టు చేయాలని ప్రిన్సిపాల్ ఎంవి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎంఆర్ఎస్ ప్రవేశ పరీక్షల ఆరో తరగతి ప్రవేశానికి ఎంపికైన విద్యార్ధినీ విద్యార్థులు ఈ నెలాఖరులోగా విద్యార్హత, కుల, ఆదాయ ధృవపత్రాలు, రేషన్, ఆధార్ కార్డులతో హాజరు కావాలని సూచించారు. రిపోర్టింగ్ ఆలస్యం చేస్తే సీటు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం: వరి విత్తనాలు కావల్సిన రైతులు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ ఆధార్ కార్డు తీసుకెళ్లి ఏ విత్తనాలు కావాలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. లేకుంటే విత్తనాలు పంపిణీ చేసే అవకాశం లేదన్నారు. రైతులు ముందుగా విత్తనాల రకం నమోదు చేసుకోవడంతో పాటు నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జనభాగీదారి కార్యక్రమంపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - సీలేరు: పూర్వ ప్రాథమిక విద్య మరింత ప్రోత్సాహాన్ని తెలియజేస్తూ జికేవీధి ప్రాజెక్టు దారకొండ సెక్టార్ పరిధిలో గల కాకనూరు సెంటర్ పరిధిలో జనభాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ కృష్ణకుమారి మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పూర్వ ప్రాథమిక విద్య ద్వారా పిల్లల్లో మానసిక, శారీరక, సాంఘిక, భాషాభివృద్ధి, గణితాభివృద్ధి, మేధాభివృద్ధి జరుగుతుందన్నారు. చిన్నప్పటి నుండి పిల్లల్లో అన్ని అభివృద్ధి పట్ల జాగ్రత్త తీసుకోవడం వలన ఒక ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలజర్త మినీ టీచర్ బత్తుల మీనాక్షిదేవి, చెరుకుమల్లు మినీ టీచర్ సుంకరి పార్వతమ్మ, బత్తుల నాగమణి సర్పంచ్ ముర్ల కమలమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధి

విశాలాంధ్ర - పెందుర్తి: అటు సంక్షేమం ఇటు అభివృద్ధి చేస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని జీవీఎంసీ 95వ వార్డు కార్పోరేటర్ ముమ్మన దేముడు స్పష్టం చేశారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మల ఖాతాలలోకి మూడో ఏడాది వై.యస్.ఆర్ ఆసరా సొమ్ము జమ చేసిన సందర్భంగా జీవీఎంసీ కృష్ణరాయపురంలో లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసారు. ఆసరా లబ్ధిదారులు మహిళలు హర్షద్వానాలతో థాంక్యూ సీఎం సార్ అని కీర్తించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లుగా పాలన సాగిస్తున్న నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు అంగటి సూరిబాబు, సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన సంతోష్, బొడ్డు దేముడుబాబు, ఉమామహేష్, చాణక్య, దలాయి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలను సిమెంట్ పలకలతో మూయొద్దు

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణ సముదాయాల చెంత మురుగు కాలువలపై వ్యాపారులు ఒక్కొక్క సిమెంటు పలక చొప్పున మాత్రమే వేసుకోవాలని, ఎక్కువ పలకలు వేసి పారిశుద్ధ్య సమస్యకు కారకులు కావద్దని చింతపల్లి పంచాయతీ ఆదివారం ఒక ప్రకటనలో కోరింది. మురుగు కాలువలలో మురుగునీటితో పాటు చెత్త పేరుకుపోవడం తద్వారా దోమల వ్యాప్తి, తదితర కారణాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పంచాయతీ కఠిన నిర్ణయాలకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న దుకాణ యజమానులకు ఆదివారం నోటీసులు జారీ చేసింది. ఒక్కొక్క దుకాణం వద్ద ఒక్కొక్క సిమెంట్ పలక మాత్రమే ఏర్పాటు చేసుకొని ములుగు కాలువలలో చెత్తను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులు తొలగించేందుకు సహకరించాలని, అదే క్రమంలో పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ కవర్ల క్రయవిక్రయాలు, వినియోగం లేకుండా పంచాయతీ అధికారులు, పాలకమండలితో సహకరించాలని లేనిపక్షంలో పంచాయతీ తీసుకునే కఠిన చర్యలకు బాధ్యులు కావలసి ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

20 నుంచి జగన్నాథ స్వామి రథయాత్ర

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: స్థానిక గవరపాలెం శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్ర మహోత్సవాలు ఈనెల 20 నుంచి 29 వరకు జరుగుతాయని ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ తెలియజేశారు. 19వ తేదీ సోమవారం రాత్రి ఆలయ మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి కళ్యాణం మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వ హిస్తామని తెలిపారు. 20న మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. జగన్నాథ స్వామి నుండి రథోత్సవం గవరపాలెం పెరుగు బజార్, గాంధీభవన్ జంక్షన్, మల్ల వీధి మీదుగా గూడ్స్ రోడ్డు వద్ద ఉన్న ఇంద్రజ్యుహాలకు చేరుకుంటుంది. ఈనెల 21 బుధవారం నుండి ప్రతిరోజు స్వామి వారు దశావతారాల అలంకరణతో శ్రీ స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారని, ప్రతిరోజు స్వామివారికి సుప్రభాత సేవ అర్చన జరుగుతాయన్నారు. ఈనెల 29వ ఆఖరి రోజు భారీ అన్న సమారాధన అనంతరం తిరిగి రథయాత్ర ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

విద్యుత్ సమస్యలపై టీడీపీ నిరసన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఇటీవల సుమారు నెల రోజులుగా ప్రజలు అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బంది పడుతున్నారని, అలాగే లో ఓల్టేజ్ సమస్యల వలన తమ తమ విలువైన వస్తువులు పాడైపోయి ఆర్థికంగా కూడా నష్టపోతున్నారని ఎన్నిసార్లు విన్నవిం చుకున్నా విద్యుత్ అధికారులు ఏదో ఒక సాకుతో తాత్సారం చేస్తున్నారని, దీనిపై వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే మండల పరిధిలోని యువకులు, మహిళలతో విద్యుత్ కార్యాలయాలను ముట్టడించవలసి వస్తుందని టీడీపీ నాయకులు హెచ్చరించారు. పెద గంట్యాడ సబ్ స్టేషన్ దగ్గర పెదగంట్యాడ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యములో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి మాట్లాడారు. ఎన్నిసార్లు సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లినా మొక్కుబడిగా అప్పటికి ఏదో ఒకటి చేసి వెళ్లిపోవడం తప్ప శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోకపోవడం శోచనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి రెడ్డి, స్థానిక యువకులు, మహిళలు, టీడీపీ నాయకులు గోక్యడ ముత్యాలు, నమ్మి అప్పారావు, దోమ్మేటి పెరుమాళ్, పెద్దాడ సోము నాయుడు, టేకేటి పెంటయ్య, శ్రీముసిరి శ్రీనివాసరావు, రాజు, మొల్లి రమణ బాబు, బొంగు రాజు, పాము తాతారావు, ఉరుకుటి వెంకటరావు, అండిబోయిన రాము నాయుడు, బస అప్పల రెడ్డి, పెంటయ్య, ఈశ్వర రావు, అప్పారావు, పులి సురేశ్ రెడ్డి, నామాల శ్రీకాంత్, శంకర్‌రావు, పైడి రాజు, రాజు, మురళి, ఏళ్లంకి రమణ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్లంకిలో అప్రకటిత విద్యుత్ కోతలు

విశాలాంధ్ర - ఆనందపురం: విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని వేసవి కాలం దృష్యా రాత్రి పూట కరెంటు కోతతో వెల్లంకి గ్రామ పంచాయతీలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని భారతీయ జనతా పార్టీ విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ విషయమై వెల్లంకి గ్రామ ప్రజలకు విద్యుత్ కోతలు నుంచి ఉపశమనం కల్పి ంచాలని, వెల్లంకి గ్రామప్రజలు ఎన్నో ఇబ్బం దులకు గురవుతూ తరచూ విద్యుత్ కోతలతో రైతులు, గ్రామ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతు న్నారని, తీవ్రమైన వడగాల్పులు, ఎండలకు కరెంట్ కోతలు తోడవడంతో జనం అల్లాడిపోతున్నారని అన్నారు. పెరుగుతున్న ఎండ వేడిమికి విద్యుత్ కోతలు తోడవడంతో వెల్లంకి గ్రామ పంచాయతీలో ప్రజలు వడదెబ్బకు గురవుతున్నారని, పగటి పూట రోజు వారి కూలీ పనులకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చాక నిద్రించే సమయంలో విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి పూట కరెంట్ కోతతో నిద్ర కరువవుతూ ఫలితంగా ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారన్నారు. కంటి మీద కునుకు లేని రాత్రులు గడుపుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల విద్యుత్తు సరఫరా చేస్తామని హామీలు ఇచ్చారని, ప్రస్తుతం ప్రతి రోజు 6 గంటల పాటు విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారన్నారు. విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు లేకపోవడం వల్లే సంక్షోభం ఏర్పడిందన్నారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలపై భారం మోపుతుందన్నారు. ప్రజల కష్టాలను నేరుగా చూసి విద్యుత్ కోతలను తగ్గించి ప్రజల కష్టాలకు చరమగీతం పాడాలని కోరారు.

చరవాణి, అంతర్జాల సంకేతాలు అందుబాటులోకి తేవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: చరవాణి, అంతర్జాల సంకేతాలు అందక వివిధ పంచాయతీల పరిధిలో సచివాలయ ఉద్యోగులతో పాటు వాలంటీర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవమని వాలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు వేములపూడి పరమేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బలపం పంచాయితీలో చరవాణి, అంతర్జాల సంకేతాలు అందక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఆ పంచాయతీ సర్పంచ్ రమేష్ నాయుడు అభిప్రాయంతో తాము ఏకీభవిస్తున్నామన్నారు. ఆ పంచాయతీతో పాటు మండలంలోని అంజలి శని వారం, కిటుముల, గొంది పాకల, తమ్ముంగుల, ఎర్ర బొమ్మల వంటి వివిధ పంచాయతీలలో వివిధ గ్రామాల ప్రజలకు చరవాణి, అంతర్జాల సంకేతాలు అందక ప్రజలతోపాటు వాలంటీర్లు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. సంకేతాల కోసం కొండలు, గుట్టలు ఎక్కవలసిన పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సంబంధిత ఉన్నత అధికారులు చొరవ చూపాలన్నారు. టవర్‌ల నిర్మాణం కొరకు రహదారికిరువైపులా గోతులు త్రవ్విన టవర్ల యాజమాన్యం వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సాంస్కృతిక పునర్జీవంతో హక్కులకు రక్షణ



విశాలాంధ్ర - చింతూరు: సాంస్కృతిక పునర్జీవం వలన హక్కులు రక్షించబడతాయని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడే మురళి పేర్కొన్నారు. ఆదివారం ఎజి కోడేరులో జరిగిన ఏవీఎస్పి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసులు తమ యొక్క హక్కులను పరిరక్షించాలంటే సాంస్కృతిక పునర్జీవం కీలకమైన అంశమని, తద్వారా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. జూలై 21న విశ్వ కోయ భాషా దినోత్సవం ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కోయ భాషను ఆంధ్ర, ఒడిశా, చత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకలో రాష్ట్రాలలో దాదాపు 4 కోట్ల మంది మాట్లాడతారని కావున జాతీయ భాషగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన నష్టపోతున్న నిర్వాసితులకు పరిహారంతో పాటు, ఉపాధి అవకాశాలు కల్పించాలని, వారి యొక్క సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడం కోసం ట్రైబల్ మ్యూజియం రంపచోడవరం, చింతూరు, కన్నపురం ఐటీడీఏ పరిధిలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి పులి వీరయ్య, ఆట జిల్లా నాయకుడు పూనెం బాబూరావు, జల్లి మధు, మడకం శ్రీరాములు, మడకం సత్యనారాయణ, పైదా ముత్తయ్య, సున్నం కన్నయ్య, కూర రత్తయ్య, మడకం సుబ్బయ్య, మడకం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఎంఈజీపీ రుణాలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - మారేడుమిల్లి: అల్లూరి సీతా రామరాజు జిల్లా మారేడుమిల్లి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రధానమంత్రి ఎంప్లా యిస్ మేనేజ్మెంట్ జనరేషన్ (స్వయం ఉపాధి చిన్న పరిశ్రమల పెట్టుబడి) ఇంటర్వ్యూలు నిర్వహించ బడతాయని వెలుగు ఏపీఎం శ్యాంబాబు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంపీడీవో ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించ బడతాయని అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, రేషన్ కార్డ్, క్యాస్ట్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, పాస్ ఫోటోలు కలిగిన ఆధారాలతో ఉదయం 10:30 గంటలకు ఎంపీడీవో కార్యాల యంలో హాజరుకావాలని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు మారేడుమిల్లి ఎంపీడీవో, బ్యాంక్ మేనేజర్స్ హాజరవుతారని తెలిపారు.

రమణకు జాతీయ సామాజిక విశిష్ట సేవా పురస్కారం

విశాలాంధ్ర - చింతపల్లి: జాతీయ సామాజిక విశిష్ట సేవ భూషణ్ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని చింతపల్లి గ్రామానికి చెందిన దూనబోయన రమణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, మాతృమూర్తుల విలువలపై (అమ్మ కోసం) రాసిన ఆర్టి కల్‌లను చూసిన బాపట్లకు చెందిన లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా బాపట్ల పట్టణంలో శనివారం జాతీయ సామాజిక విశిష్ట సేవా భూషణ్ పురస్కారం అందజేశా ర న్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఐసీడీఎస్ పీడీ కె.ఉమా, బాపట్ల సీఐ పి.కృష్ణయ్య, గ్రేస్ ఫౌండేషన్ చైర్మన్ షాలేం రాజు వంటి ప్రముఖుల చేతుల మీదుగా ఈ పుంస్కారం అందుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

25న యోగా పోటీలు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఈనెల 25న కోలపర్తి భవన్‌లో వున్న హార్ట్ ఫుల్ నెస్ సంస్థ శ్రీ రామచంద్ర మిషన్ (హెచ్ ఎఫ్ ఎన్)వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి హార్ట్ ఫుల్ నెస్ సెంటర్ కోఆర్డినేటర్ జి.మంగయ్య, కోలపర్తి భవన నిర్మాణ స్థాపకులు కోలపర్తి జయబాబులు తెలిపారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఏడాది జూన్ 5న ప్రారంభించిన ఈ కేంద్రంలో నేటికీ 200 మందికి పైగా ఉచితంగా యోగా శిక్షణ అభ్యసిస్తున్నారని తెలిపారు. 170 దేశాలలో పైగా యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ధ్యానం ద్వారా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయని అన్నారు. లోక కళ్యాణార్థం ప్రతి ఒక్కరూ యోగా చేయవలసిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు, కళాశాలలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 25న యోగా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

నేడు డ్రైవింగ్ లైసెన్స్ మేళా



విశాలాంధ్ర - చింతపల్లి: చింతపల్లి సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ లైసెన్స్ మేళాను 18 ఏళ్ళు నిండిన యువతీ, యువకులకు డ్రైవింగ్ లైసెన్సులు కొరకు డ్రైవింగ్ లైసెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, డ్రైవింగ్ లైసెన్స్ కావలసిన వారు ఆధార్ కార్డు, తండ్రి ఆధార్ కార్డు, పుట్టిన తేదీ నిరూపణ ధ్రువ పత్రం, ఇంటి నెం., ఆధార్ లింకైన సెల్ ఫోన్ నెంబరు, 40 ఏళ్ళు దాటిన వారు వైద్య పరీక్షల ధ్రువపత్రం తీసుకురావాలన్నారు. దగ్గరలోని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వద్ద స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. స్లాట్ బుకింగ్ ప్రతి రోజు అందుబాటులో ఉంటుందన్నారు. ఆదార్ కార్డ్ లో ఏమైనా సమస్యలుంటే ముందుగా వాటిని సరి చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనానికి డ్రైవింగ్ లైసెన్సు కావలసిన వారు రూ.260లు, 4 చక్రాలు గల వాహనానికి లైసెన్సు కొరకు రూ.410ల రుసుము చెల్లించాలన్నారు. అన్ని అర్హతలు కలిగిన అభ్యర్థులు మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రమాదంలో గాయపడిన పాత్రికేయునికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్థానిక సీనియర్ పాత్రికేయుడు, చోడవరం ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నేమాల సతీష్‌ను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు ఆదివారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం యూనియన్ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న సతీష్‌ను ఆయన స్వగృహంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సిహెచ్. బిఎల్.స్వామి, నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఎస్.రామకోటి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు కొప్పాక భాస్కర్ పరామర్శించారు. వారితోపాటు యూనియన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కుబిరెడ్డి రాధాకృష్ణ, స్థానిక సీనియర్ పాత్రికేయులు, గజ్జి బాల గంగాధర్, నీలి శ్రీను తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటరమణకు ప్రతిభా పురస్కారం

విశాలాంధ్ర - చింతపల్లి: విధుల పట్ల అంకితభావం, సేవ భావం, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చింతపల్లి ఎస్సై ఎం.వెంకట రమణను అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయములో అభినందించారు. వెంకటరమణ ఏడు నెలల కాలంలో చింతపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అన్నవరం ఇన్చార్జి ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్నారు. అతి తక్కువ కాలంలో ఎస్సై వెంకటరమణ పనితీరు పట్ల, నిబద్ధత కలిగి ఉండటం వలన ఆయనకు ఎస్పీ తుహిన్ సిన్హా రివార్డు తోపాటు ప్రత్యేక ప్రశంసాపత్రం ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఎఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పాల్గొన్నారు.

కారం వెంకటేష్ మృతికి సీపీఐ సంతాపం

విశాలాంధ్ర - ఎటపాక : ఎటపాక మండలం గన్నవరం గ్రామానికి చెందినకారం వెంకటేష్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతు ఆదివారం మృతి చెందారు. వారికీ అల్లూరి జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, ఎంపిటిసి కంటె రాజు, సిపిఐ బృందం పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ మంచి వ్యక్తి ని కోల్పోయిందని వారు ప్రగాఢ సానుభూతి ని తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - మధురవాడ: పౌరగ్రంథాలయం ఏర్పాటుతో పాటు, చంద్రంపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధాన రహదారి దాటుటకు పడుతున్న ఇబ్బందిని గమనించి పై వంతెన లేదా భూగర్భ మార్గం గాని ఏర్పాటు చేయాలని కోరుతూ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్‌కు వినతి అందించారు. రోడ్డు వంతెన దగ్గర వర్షం పడినప్పుడల్లా నీరు విపరీతంగా నిలిచిపోతుందని, దీని వలన పాదచారులు, వాహనదారులు ప్రయాణించడానికి పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విప్లవ గాయకుడు, పౌర సంక్షేమ సంఘం సభ్యుడు వందిరి రామును సన్మానించి, విప్లవ గీతాల పుస్తకాలను శాసనసభ్యులు, ఏడవ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ వెంకటరావులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తాతపూడి ప్రదీప్ కుమార్,బెల్లాపు పాపారావు, నూకవరపు బాబ్జి, జగన్మోహన్, వంటాకుల శ్రీనివాస్, తోట ఆషా స్వరూప్, నాగేశ్వరరావు, బి.యన్ రావు, కావ్య రెడ్డి, ఆశా జ్యోతి, కరీం, బ్రిక్స్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్వ రోగ నివారిణి యోగా

విశాలాంధ్ర - విశాఖ సిటీ : యోగా సర్వ రోగ నివారినిగా పనిచేస్తుందని ప్రజా పిత బ్రహ్మా కుమారీస్ ఈశ్వరీయ విద్యాలయం ప్రతినిధి బి.కే రామేశ్వరి అన్నారు. ఆదివారం డాబా గార్డెన్స్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రామేశ్వరి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులు ఉన్న వయస్సుల వారికి ఆరోగ్య సమస్యలనేవి శారీరక, మానసిక రుగ్మతలు అనేకరకాలుగా వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరు ప్రపంచ వ్యాప్తంగా ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ మెడిటేషన్ ద్వారా స్వాంతన పొందవచ్చు అన్నారు. ఉద్యోగ వ్యాపారస్థులకు, విద్యార్థులు శారీరక, మానసిక క్రమ శిక్షణ వుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలు రావు అని, యోగా చేసుకోవాలన్నారు. అతిథులను యోగా డే పురస్కరించుకొని జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సమావేశంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు, జాతీయ జర్నలిస్ట్ లు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, బ్రహ్మకుమారిస్ సంస్థ ప్రతినిధులు లలితా దేవి, వేణు, పాల్గొన్నారు. అనంతరం వేణు నమస్కారం, దండ, అష్టాంగ, భుజంగ, పర్వత, అశ్వ సంచాన, హస్త విత్త, ప్రణవ్ తదితర ఆసనాలు విద్యార్థుల ద్వారా ప్రదర్శించారు.

హక్కుల సాధనకు జర్నలిస్టులు పోరాడాలి

విశాలాంధ్ర - దేవరాపల్లి: న్యాయపరమైన హక్కుల సాధన కోసం ప్రతి జర్నలిస్టు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యుజె) అనకాపల్లి జిల్లా అధ్యక్షులు సి హెచ్ పి ఎల్ స్వామి కోరారు. చోడవరం ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశం మందిరంలో ఆదివారం జరిగింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు డివియం నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంకితభావంతో పనిచేసే జర్నలిస్టులకు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. జడ్పిటిసి కర్రి సత్యం, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు మాట్లాడుతూ

జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పి.జోగినాయుడు, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు కె.చంద్రరావు, సీనియర్ పాత్రికేయులు కాటపల్లి అప్పారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.భాస్కర్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు రామకోటి, జిల్లా సహాయ కార్యదర్శి కుబిరెడ్డి రాధాకృష్ణ, సీనియర్ జర్నలిస్టులు కోవెల శ్రీను, ఓరుగంటి రాంబాబు, డి.సన్యాసిరావు, బి.రామరాజు, పి.గణేష్, బివిఎస్ ప్రసాద్, నానాజీ, నాగభూషణం, ఎంఎ నాయుడు, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శబరి నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని చిడుమూరుకు చెందిన కట్టం విష్ణు (15) అనే యువకుడు శనివారం సాయంత్రం స్నానం కోసం శబరి నదికి వెళ్లి గల్లంతయ్యాడు. అతని మృతదేహం ఆదివారం సాయంత్రం కుయిగూరు వద్ద లభ్యమైంది. చింతూరు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

విశాలాంధ్ర - కొయ్యూరు: రైతాంగానికి పంపిణీ చేసేందుకు కావలసిన వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారిణి డి.ఉమాదేవి తెలిపారు. మండలంలోని ఎనిమిది రైతు భరోసా కేంద్రాలలో వరి విత్తనాలు రైతాంగానికి పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతానికి ఆర్జీఎల్ 2537, ఎంటియు 1064, ఎంటియు 1121,

బిపిటి 5204, ఆర్ ఎన్ఆర్ 15048 రకాల వరి విత్తనాలుపంపిణీకి సిద్ధం చేయడం జరిగిందన్నారు. విత్తనాల మొలక శాతం కనుగొన్న తర్వాత మండల రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలను పూర్తిస్థాయిలో అందజేయడం జరుగుతుందని ఏవో ఉమాదేవి వివరించారు.

వాహనాల తనిఖీ

విశాలాంధ్ర - రంపచోడవరం: మండలంలో పందిరి మామిడి జంక్షన్ వద్ద ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ పర్యవేక్షణలో రంపచోడవరం ఎస్సై మోహన్ కుమార్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాన్ని అతి వేగంగా నడపడం, ద్విచవాహనంపై ముగ్గురు ప్రయాణం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం లాంటివి చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

ప్రధానోపాధ్యాయునికి పదోన్నతి

విశాలాంధ్ర - చింతూరు: జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్న తుర్రం లక్ష్మణ్ కూనవరం మండల విద్య శాఖ అధికారిగా పదోన్నతి పొందారు. మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేశ్వర్లు చింతూరు మండల విద్య శాఖ అధికారి(యం ఈ ఓ)గా పదోన్నతి పొందారు.

దాతల సహాయంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దాతల సహాయ సహకారాలతో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ అచార్య వి. ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. విశాఖపట్నం స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ కార్యదర్శి ప్రొఫెసర్ వి. వల్లికుమారి రూ.55వేలు విలువ చేసే ఇంపోర్టెడ్ మెడికల్ ఆక్సిజెన్ కాన్సంట్రేటర్‌ను లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అచార్య ఉమామహేశ్వరరావు ఆమెను అభినందించారు. ఆచారి వల్లి కుమారి క్యాన్సర్ రోగులకు ప్రతినెల 2000 రూపాయలు అందజేస్తున్నారని చెప్పారు. దాతలు మరింత మంది ముందుకు వచ్చి ఆసుపత్రి రోగులకు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

20న మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర - కొయ్యూరు: గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పన చర్యల్లో భాగంగా ఈనెల 20న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు. జాబ్ మేళా పోస్టర్‌ను నైపుణ్య అభివృద్ధి సంస్థ ప్రతినిధులతో కలిసి ఎంపీ మాధవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివరాలకు 9491786463 నెంబర్ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చరిత్ర పుటలలో నెహ్రూ చరిత్రను తొలగించడం ఎవరి తరం కాదు

ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకట్రావు

విశాలాంధ్ర - పెందుర్తి: చరిత్ర పుటలలో నెహ్రూ జీవిత విశేషాలు తొలగించడం ఎవరి తరం కాదని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకట్రావు పేర్కొన్నారు. పురాతనమైన నెహ్రూ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీని ప్రైమ్ మినిస్టర్ మ్యూజియంగా మార్చడం బిజెపి చౌకబారు రాజకీయానికి తార్కాణమని విమర్శించారు. జవహర్ లాల్ నెహ్రూ నూతన భారతావణి రూపశిల్పి అని, భారత జాతీయోద్యమంలోని, ఉదారవాద, ప్రగతిశీల, ఆధునిక స్రవంతికి ప్రతినిధిగా గుర్తింపు పొందిన మహోన్నతుడని కొనియాడారు. మహాత్మా గాంధీతో ఉన్న సాన్నిహిత్యం, ప్రపంచ, భారత చరిత్రలపై అధ్యయనం నవభారత గమనానికి అందించిన విశిష్టమైన మార్గం నెహ్రూకు గొప్ప పేరు తెచ్చి పెట్టాయన్నారు. నెహ్రూ చరిత్రను తగ్గిద్దామనుకునేవారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు.

పేదల శ్రేయస్సే జగనన్న లక్ష్యం: ఎమ్మెల్యే ముత్తంశెట్టి

విశాలాంధ్ర - మధురవాడ: మండే ఎండల్ని లెక్క చెయ్యకుండా మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ ప్రజలు వద్దకు వెళ్ళి వారితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గడప కడపకు పర్యటన లో భాగంగా ఆదివారం ఆయన యన్జీవోస్ కోలనీ 1 సచివాలయం పరిదిలో గల మిథిలాపురి ఉడా కోలనీ - యన్జీవో కోలనీలో రెండవ రోజు (7వ క్లస్టర్) 600 ఇళ్ళు గడప గడపకు వెళ్ళి ప్రజలకు ఈ నాలుగు ఏళ్ళలో వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అమలు, జగన్ పాలనపై ప్రజలకు వివరించారు. జగన్ మోహన్ రెడ్డి పరిపాలనపై ప్రజలు అభిప్రాయం అడగగా సానుకూల స్పందన రావటంతో అయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ జగనన్న పాలనపై సంపూర్ణ నమ్మకంతో ఉన్నారని రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. మిథిలాపురి ఉడా కాలనీలో దీర్ఘకాలిక సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడగగా యనీవో కోలనీ లో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని, మిథిలాపురి ఉడా కోలనీ లో - కోలనీ లో డ్రెయినేజీ వ్యవస్థ మరమ్మతులు చేపట్టాలని, సామాజిక భవనం నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. సమస్యలు విన్న ఆయన త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఇంచార్జి ముత్తంశెట్టి మహేష్, తహశీల్దార్ ఎస్.రమణయ్య, జోన్ 2 కమీషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి, ఐదు, ఏడు వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, పోతిన శ్రీనివాసరావు, వంకాయల మారుతీ ప్రసాద్, పిల్లా కృష్ణ మూర్తి పాత్రుడు, నూకవరపు బాబ్జి, పిల్లా సూరిబాబు, మగ్గూరి వెంకట రమణ, మొజ్జాడ రమణమూర్తి, అల్లాడ లింగేశ్వర రావు, కుడిటి రామారావు, జ్యోతిర్మయి, తమ్మినేని వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు విశిష్ట సేవలు

విశాలాంధ్ర - విశాఖ : అమెరికాలోనూ, భారత దేశంలోనూ ఉన్న తెలుగు ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) 15 సంవత్సరాల కన్వెన్షన్ కన్వీనర్ విజయ్ గుడిసేవ, ఆప్తా పూర్వ అధ్యక్షులు గోపాల్ గూడపాటి, ఆప్తా మీడియా ఛైర్ చంద్రశేఖర్ పోలిశెట్టి తెలిపారు. విశాఖలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో అమెరికాలోని అట్లాంటాలో ఆప్తా ఏర్పాటు చేసి 15 ఏళ్లు అవుతున్న సందర్భంగా కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులో ప్రస్తుత కార్యక్రమాలపై చర్చించి, సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరుస్తామని చెప్పారు. ఈ సదస్సులో వివిధ రంగాల్లో నిష్ణాతుల్కైన తెలుగు ప్రముఖుల్ని సత్కరించేందుకు నిర్ణయించామన్నారు. తెలుగు సంస్కృతి, మూలాల్ని మర్చిపోకుండా 20వేల కుటుంబాల సభ్యత్వం కలిగిన తమ సంస్థ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ సదస్సులో తెలుగు ప్రముఖుల్ని సత్కరించదలిచామన్నారు. గతానికి భిన్నంగా ఈసారి మిలటరీకి చెందిన10 మందిని కూడా సత్కరించనున్నామని చెప్పారు. భారీ ఖర్చుతో నిర్వహించనున్న సదస్సుకు తెలుగు మంత్రి బొత్స సత్యనారాయణ, మెగాస్టార్ చిరంజీవి, పవన్ కల్యాణ్ తదితరులను ఆహ్వానించామన్నారు. తెలుపు రంగు రేషన్ కార్డు, 80 శాతం పైన మార్కులు వచ్చిన పది నుంచి పీజీ విద్యార్థులకు రూ.10వేల నుంచి రూ.25వేలు స్కలర్ షిప్ లు ఇస్తున్నామని అన్నారు. 2018లో విశాఖలో వైద్య శిబిరం నిర్వహించి 10వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు శానిటరీ నాప్ కిన్స్

అందజేస్తున్నామని చెప్పారు. సుమారు 30 రకాల సేవలు అందజేస్తున్నామని చెప్పారు. ఇమ్మిగ్రేషన్, జాబ్ అసిస్టెన్స్, కెరీర్ గైడెన్స్ అందజేస్తున్నామని తెలిపారు. ఆప్తా అమెరికాలో రెండో పెద్ద సేవా సంస్థ అని తెలిపారు. సదస్సు కు రెండు వేల మంది హాజరవుతారని, 400 మంది వాలంటీర్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆప్తా ప్రతినిధులు సేవా కార్యక్రమాలను సమన్వయం చేస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వాలను మేల్కొలిపేందుకే పాదయాత్ర

విశాలాంధ్ర - చింతూరు: ప్రభుత్వాలను మేల్కొలిపేందుకే పాదయాత్ర చేపడుతున్నట్లు సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు బి.వెంకటేశ్వర్లు అన్నారు. పోల వరం నిర్వాసితుల పోరు కేక మహా పాదయాత్ర సందర్భంగా ఆదివారం చింతూరు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలను మేలుకొలిపేందుకే పోలవరం నిర్వాసితుల పోరుకేక పేరుతో మహా పాదయాత్ర ఈనెల 20వ తేదీ నుండి నెల్లిపాక నుండి విజయవాడ వరకు ప్రారంభం కానుందని తెలిపారు. కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తూ నిర్వాసితులను నిండా ముంచుతున్న జగన్ మోడీ ప్రభుత్వాలు విధానాలపై నిలదీసేందుకు చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వాలు పునరావాసానికి పరిహార నిధులు కేటాయించకుండా ప్రాజెక్టును నిర్మిస్తూ ప్రతి సంవత్సరం నిర్వాసితులను నిండా ముంచుతూ పేదల బ్రతుకులను చిద్రం చేస్తున్నారని అన్నారు. 45. 15 కాంటూరు పేరుతో విభజించుతున్న గ్రామాలన్నీ 38 కాంటూర్లో మునిగిపోయి పోతున్నాయని కాబట్టి శుద్ధ తప్పులే అన్నారు. ఇటీవల రాడార్ సర్వే అని ఆ సర్వే ద్వారా ఇటీవల 17 గ్రామాలు మరియు 14 గ్రామాల్లో ప్రాధాన్యత గ్రామాలని ముంపు జాబితాలో సర్వే కోసం ప్రకటనలు చేశారన్నారు. అందులో చింతూరు లో మార్కండేయులు పేట అనే గ్రామం లేదని కాబట్టి రాడార్ సర్వే కూడా తప్పుల తడకగా ఉందన్నారు. కాబట్టి 2022 వరదలను ప్రామాణికంగా తీసుకొని అన్ని గ్రామాలన్నిటిని సర్వే కోసం నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ పాదయాత్ర ప్రభుత్వం చేసే కుట్రలను ఎండగడుతూ తూర్పార పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్. నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు. కుంజ సీతారామయ్య. ఎర్రంశెట్టి శ్రీనివాస్. పల్లపు వెంకట్. సీసం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎల్ఆర్ మేళాను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - కొయ్యూరు: సేతు కార్యక్రమంలో భాగంగా చింతపల్లిలో 19 నుండి 26 వరకు డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. అల్లూరి జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్, రవాణా శాఖ, మరియు డిఎల్పిఓ సహకారంతో అల్లూరి జిల్లా చింతపల్లి ఎంపీడీవో కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల నుండి డ్రైవింగ్ లైసెన్స్ లేని యువతీ యువకులు సమీప గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వద్ద స్లాట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 19 నుండి 26 వరకు నిర్వహించనున్న ఎల్ఎల్ఆర్ మేళాలో లైసెన్స్ పొందగోరు అభ్యర్థులు ఆయా తేదీల్లో స్లాట్ నమోదు చేసుకోవాలన్నారు. స్లాట్ బుక్ చేసుకునే అభ్యర్థుల ఆధార్ కార్డు వారి మొబైల్ నెంబర్ లింక్ అయి ఉండాలని, అలాగే ఆధార్ కార్డులో తప్పనిసరిగా తండ్రి పేరు, పుట్టిన తేదీ నెల సంవత్సరం తప్పనిసరిగా నమోదై ఉండాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ ఆధార్ కార్డు ఒరిజినల్ ధ్రువపత్రాలతో లైసెన్స్ పరీక్షకు హాజరు కావాలన్నారు. 40 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు తప్పనిసరిగా మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎల్ఎల్ఆర్ పొందిన ఆరు నెలలలో పర్మినెంట్ లైసెన్స్ పొందవలెనని సూచించారు. ఈ అవకాశాన్ని డ్రైవింగ్ లైసెన్స్ లేని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సీతయ్య కోరారు.

విశాఖ వేర్‌హౌసింగ్ గణనీయమైన వృద్ధి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నైట్ ఫ్రాంక్ ఇండియా, అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెన్సీ, వారి తాజా నివేదిక -ఇండియా వేర్‌హౌసింగ్ మార్కెట్ రిపోర్ట్ - 2023'లో, విశాఖపట్నం ఆర్థిక సంవత్సరం 23లో 1.22 మిలియన్ చదరపు అడుగుల గిడ్డంగుల లావాదేవీలను నమోదు చేసిందని పేర్కొంది. ఇది ఆర్థిక సంవత్సరం22లో నమోదైన 0.34 మిలియన్ చదరపు అడుగులతో పోలిస్తే 265 శాతం వైటవై వృద్ధి చెందింది. భారతదేశ ద్వితీయ మార్కెట్లో ఇదే అత్యధిక వార్షిక వృద్ధి. విశాఖపట్నంలో డ్రెడ్జింగ్, షిప్‌బిల్డింగ్, థర్మల్ ఎనర్జీ, ఆయిల్, పెట్రోలియం స్టీల్ ఫ్యాబ్రికేషన్ వంటి భారీ పరిశ్రమలు గణనీయంగా ఉన్నాయి. ఫిషింగ్ నగరంలో ఒక ముఖ్యమైన పరిశ్రమ మరియు దాని ఎగుమతుల్లో ఎక్కువ భాగం చేస్తుంది. పరిశ్రమ విభజనకు సంబంధించి లావాదేవీల వాల్యూమ్ రిటైల్ తయారీ ఎఫ్‌వై 23లో వేర్‌హౌసింగ్ డిమాండ్ వాటా 35 శాతం , 33 శాతం ప్రధాన డ్రైవర్లుగా ఉన్నాయి. మొత్తం డిమాండ్‌లో ఇ-కామర్స్ మరియు 3 పీ ఎల్ ప్లేయర్‌ల నుండి డిమాండ్ వరుసగా 13 12 శాతం ఉందనీ ఆ సంస్థ వెల్లడించింది.

జగన్నాథ రథయాత్ర వార్షికోత్సవాల్లో బాలలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మంగళవారం నుండి పది రోజుల పాటు జరగనున్న జగన్నాథ రథయాత్ర వార్షికోత్సవాల్లో హ్యాజరయ్యే పిల్లలకు వారి హక్కుల్లో భాగంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఆదివారం టర్నర్ చౌల్ట్రీ దేవాదాయ శాఖ కార్యాలయ ఆవరణలో దేవాదాయ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ 1098 చైల్డ్ లైన్, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే దివ్యాంగ బాలలకు ప్రత్యేక దర్శనం కల్పించేందుకు ట్రై సైకిళ్ళతో పాటు ప్రత్యేక దర్శన లైన్లు ఏర్పాట్లు చేస్తున్నారా, చంటి పిల్లల తల్లులకు స్పష్టంగా అవగాహన కలిగేలా బోర్డులు ఏర్పాటు చేసి పాలు పెట్టేందుకు ప్రత్యేక కేబిన్లు, వేడిపాలు, బిస్కెట్లు పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, చైల్డ్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్ రాజు, జగన్నాథ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్ రెడ్డి, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్మెంట్ ప్రొజెక్ట్ అధికారి రమణ కుమారి, వార్డ్ వైసిపి నాయకుడు మాసిపోగు రాజు, దేవస్థాన ప్రధాన అర్చకులు జగన్నాథ ఆచార్యులు, వివిధ వార్డుల సచివాలయాల కార్యదర్శులు, వైద్య, ఆరోగ్య శాఖ, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 3 రద్దు వల్ల ఎంతో నష్టం

విశాలాంధ్ర - జికేవీధి: జీఓ నెంబరు 3 రద్దు వల్ల ఎంతో నష్టం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతంలో శత శాతం ఉద్యోగాలు కల్పించే జీఓ 3ని సుప్రీం కోర్టు రద్దు చేయడం వల్ల ఏజెన్సీలో ఆదివాసీ ఉద్యోగార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ఇకపైన వందకు ఏడు ఉద్యోగాలు మాత్రమే గిరిజనులకు ఉంటాయని ఆ ఏడు ఉద్యోగాలకు మైదాన గిరిజనుల నుండి తీవ్రమైన పోటీ ఉంటుందని, ఆ పోటిలో కనీస మౌళిక సదుపాయాలు లేని మన్యంలో ఉండే ఆదివాసీ ఉద్యోగార్థులు పోటి పడడం చాలా కష్టమని, జీఓ 3 రద్దు అయిన వెంటనే ప్రభుత్వం చేపట్టిన నియామకాలలో ఆదివాసీలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇప్పటికైనా ఆదివాసీ ఉద్యోగార్థులు పోరాటానికి దిగకపోతే షెడ్యూల్డ్ ప్రాంతంలో నియామకాలన్ని ఆదివాసేతరులతో నియమిస్తారని,జీఓ 3కి బదులుగా ఆదివాసీ సబ్ ప్లాన్ ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని అన్నారు.

దేశంలో 50వేల సభ్యుల మైలురాయిని దాటిన బీఎన్ఐ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెటింగ్ సంస్థ బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) భారత్ లో 50,000 మంది సభ్యులను అధిగమించింది. దేశవ్యాప్తంగా టైర్ 3 మరియు 4 నగరాల్లో చిన్న వ్యాపారాలను శక్తివంతం చేయడానికి బిఎన్ఐ యొక్క అద్భుతమైన చొరవతో పాటు ఈ ముఖ్యమైన మైలురాయి వస్తుంది. ఈ విజయాలను స్మరించుకోవడానికి బిఎన్ఐ వ్యవస్థాపకుడు మరియు చీఫ్ విజన్ ఆఫీసర్ డాక్టర్ ఇవాన్ మిస్నర్ భారతదేశాన్ని సందర్శించారు. ప్రపంచ మహమ్మారి విసురుతున్న సవాళ్లు ఉన్నప్పటికీ, బిఎన్ఐ వృద్ధిని కొనసాగించింది. భారతదేశంలో అసాధారణ వృద్ధిని నడిపిస్తోంది. 121 నగరాల్లోని 1080 చాప్టర్లలో 50,830 మంది సభ్యులతో బీఎన్ఐ దేశంలో తన ఉనికిని దృఢంగా స్థాపించింది. బిఎన్ఐ యొక్క రిఫరల్ ఆధారిత నెట్ వర్క్ యొక్క శక్తి 31,93,874 రిఫరల్స్ పాస్ కావడంలో స్పష్టంగా కనిపిస్తుంది, ఇది గత 12 నెలల్లో 30,516 కోట్ల వ్యాపార పరిమాణానికి దోహదం చేసింది. బీఎన్ ఐలో సీటు సగటు విలువ ఏడాదికి రూ.65.54 లక్షలుగా ఉంది.

చలో విజయవాడను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - అనకాపల్లి: రాష్ట్రంలోని భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని పెండింగ్ లో ఉన్న క్లైములకు వెంటనే నిధులు మంజూరు చేయాలని ఈనెల 20వ తేదీన చేపట్టే చలో విజయవాడను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికులు పిలుపునిచ్చారు. సంక్షేమ బోర్డులో నేటికీ సుమారు 32 వేల పైచిలుకు క్లెయిములు పెండింగ్లో ఉన్నాయని అందు వలన కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటునారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగులో ఉన్న క్లెయిములకు సంబంధించిన నిధులను వెంటనే మంజూరుచేసి మా సంక్షేమం కోసం మా వద్ద నుండి సభ్యత్వ రూపంలోనూ యజమాని నుండి సెస్ రూపంలోనూ వసూలు చేయబడిన కోట్ల రూపాయలను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు పెట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుండి పవర్ ఫైనాన్స్ పేరుతో కార్పొరేషన్లకు దారి మళ్లించిన నిధులను వెంటనే బోర్డు నందు జమ చేయాలని, నూతనంగా సంక్షేమ కార్డుల కొరకు అప్లై చేసుకున్న కార్మికులకు వెంటనే సంక్షేమ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంచి పాటి శ్రీను, జెట్టి తాతబాబు, బలిరెడ్డి రమణ, గొర్లి గోవిందా, ఎం.రాముడు, సూరి అప్పారావు, రామారావు పాల్గొన్నారు.